క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాములపాడు: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ ఆదేశించారు. శనివారం మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో ఆమె పర్యటించారు. ప్రధాన రహదారిలో డ్రైనేజీ పూడికతో నిండిపోవడంతో దానిని వెంటనే శుభ్రం చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. అలాగే ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. అనంతరం ఎర్రగూడూరు గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు పప్పు సరిగా లేకపోవడంపై వంట ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

గోకులం షెడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: స్థానిక గోకులం షెడ్డు నిర్మాణ స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయం వద్ద బీఎస్పీ, సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా బీఎస్పీ నాయకుడు స్వాములు, సీపీఐ నాయకుడు రమేష్‌బాబు మాట్లాడుతూ రైతుల కోసం నిర్మిస్తున్న మెగా గోకులం షెడ్డు స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకున్నారన్నారు. అనంతరం వారు ఎంపీడీఓ మంజులవాణికి వినతిపత్రం అందజేశారు. కాగా ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి, వెటర్నరీ ఏడీ రామాంజినాయక్ ఆక్రమణకు గురైన గోకులం షెడ్డు స్థలాన్ని పరిశీలించారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

28న చలో సిద్దేశ్వరం

పాములపాడు: సిద్దేశ్వరం– సోమశిల కొండల మధ్య ఐకానిక్ వంతెన వద్దని బ్యారేజీ కమ్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న చలో సిద్దేశ్వరం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ స్టీరింగ్‌కమిటీ కన్వీనర్ బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం పాములపాడులోని రాజరాజేశ్వరీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చలో సిద్దేశ్వరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు, సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, మల్లెల క్రిష్టారెడ్డి, శంకర్‌గౌడు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

25న టెంకాయల వేలం

బండిఆత్మకూరు: ఈనెల 25న ఓంకార క్షేత్రంలో టెంకాయల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. టెంకాయల వేలంతో పాటు ఐస్‌క్రీమ్ బండ్లు, దీపారాధన, అభిషేక వస్తువులు విక్రయించుకునేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని తెలిపారు.

స్కూల్ అభివృద్ధికి సహకారం



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

శ్రీశైలంప్రాజెక్ట్: తాము చదువుకున్న శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని 1990–91 బ్యాచ్ 10 వ తరగతి పూర్వ విద్యార్థులు అన్నారు. శనివారం శ్రీశైలం ప్రాజెక్ట్‌లో వారు సమావేశమయ్యారు. పూర్వ ప్రధానోపాధ్యాయులు జి.ఎల్లారెడ్డి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు ప్రేమ్‌సాగర్‌ను సత్కరించారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల దేవస్థానంలో భారీగా అవినీతి జరుగుతుందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని భారతీయ జనతా పార్టీ నాయకులు ఎస్‌వీఎస్ మల్లికార్జున శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దర్శనం టిక్కెట్లు, లడ్డూ తయారీ నిత్యావసర వస్తువుల సరఫరాలో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణ ఉన్నాయని చెప్పారు.

కూలీల సంఖ్య పెంచండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

జూపాడుబంగ్లా: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ మంజులవాణి ఉపాధి సిబ్బందికి సూచించారు. శనివారం ఆమె మండ్లెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు.

- మండలంలోని పోతులపాడు గ్రామంలో నెలకొన్న నీటి సమస్యపై ఈఓపీఆర్డీ మణిమంజరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర ఆరా తీశారు. కుళాయిలకు తాగునీరు సక్రమంగా సరఫరా అవుతున్నాయా, చేతిపంపులు సక్రమంగా పనిచేస్తున్నాయా అంటూ ఆరాతీశారు. గ్రామంలో మరో తాగునీటి ట్యాంకు నిర్మిస్తే నీటి సమస ఉండదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

క్షేత్రపాలకుడికి పరోక్ష సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రపాలకుడిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలువీరభద్ర స్వామికి శనివారం పరోక్ష సేవ నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ప్రదోషకాల సమయంలో అర్చకులు, వేదపండితులు పంచామృతాలతో అభిషేకాది అర్చనలు చేశారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. వీరభద్రుడికి శాస్త్రోక్తంగా విశేష అన్నాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో ఈఓ లవన్న, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బయలు వీరభద్రస్వామికి పూజలు నిర్వహిస్తున్న దేవస్థానం అధికారులు

అవగాహనతోనే ప్రమాదాలకు చెక్



ఆత్మకూరురూరల్: రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన ద్వారానే ప్రమాదాలను నియంత్రించవచ్చునని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి. తిమ్మరుసు నాయుడు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆత్మకూరు జగద్గురు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ కృష్ణమూర్తి, ఆర్‌టీసీ డీఎం మహేంద్ర, వాహనదారులు పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేసుకోండి

పాములపాడు: ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో సొంతింటి కలను సాకారం చేసుకోవాలని తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ సుమిత్రమ్మ లబ్ధిదారులకు సూచించారు. శనివారం మండలంలోని చెలిమిల్ల గ్రామంలో సర్పంచు కోట్ల చంద్రారెడ్డి అధ్యక్షతన గృహ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 63 మందికి గృహాలు మంజూరయ్యాయన్నారు. ఇందులో 21 మంది నిర్మాణాలు పూర్తి చేశారని, మిగతా వారివి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఉగాది పండుగ నాటికి ప్రతి గృహ నిర్మాణం పూర్తి కావాలని చెప్పారు. నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్ ప్రభుత్వమే అందిస్తుందన్నారు. పొదుపు గ్రూపుల ద్వారా అదనంగా రూ.35 వేలు రుణం ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ శివరామకృష్ణారెడ్డి, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



చెలిమిల్లలో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ



నెహ్రూనగర్‌లో ఇంటి నిర్మాణం చేపట్టని లబ్ధిదారురాలికి నోటీసు ఇస్తున్న అధికారులు

మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

పగిడ్యాల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు మార్చిలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేయాలని హౌసింగ్ ఏఈ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్‌లకు ఆదేశించారు. శనివారం నెహ్రూనగర్ గ్రామంలోని ఆదర్శ కాలనీని ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న వలంటీర్లకు మెమోలు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. అనంతరం ఆంజనేయనగర్ గ్రామంలో మంచినీటి బోర్, పైప్‌లైన్ మరమ్మతు పనులను ఈఓఆర్డీ పుల్లయ్యతో కలిసి పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టి నీటి ఎద్దడిని నివారించాలని పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక

బండిఆత్మకూరు: పక్కా గృహాల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందజేస్తుందని ఏఈ సుంకిరెడ్డి తెలిపారు. పెద్దదేవళాపురం గ్రామం జగనన్న కాలనీలో నిర్మిస్తున్న గృహాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం బిల్లులతో పాటు తక్కువ ధరకు సిమెంట్, స్టీల్ అందజేస్తుందన్నారు. పొదుపు మహిళలకు అదనంగా రుణం ఇస్తుందన్నారు.

జూపాడుబంగ్లా: జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్ తెలిపారు. శనివారం వారు జూపాడుబంగ్లా జగనన్నకాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

అంటువ్యాధులపై అవగాహన



హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి కాంతారావు

జూపాడుబంగ్లా: గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాపించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. బీపీ, సుగర్, క్యాన్సర్, అంటువ్యాధులపై గ్రామంలో సర్వే చేయాలన్నారు. పక్షం రోజులకొ పర్యాయం పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేసి విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై ఆరాతీయాలని డాక్టర్ గంగాధర్‌కు సూచించారు. అనంతరం ఆయన ఎస్సీ బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేసి కిచెన్, బాత్‌రూంలు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించటంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని వార్డెన్ ఉమాదేవికి సూచించారు. ఆయన వెంట డాక్టర్ గంగాధర్, సీహెచ్‌ఓ వహాబ్, సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ ఉన్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

ఆత్మకూరు: మినుము పంటలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మినుము పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆత్మకూరు పట్టణ శివారులో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్‌లోని అన్ని మండలాల్లో మినుము పంటను విస్తారంగా సాగు చేశారని, ఈ పంటకు కాండపు ఈగ సోకడంతో పంట పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ఈ పంట నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిలీ లేదా, ఏసిఫేట్ 1.0 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.



మినుములో కాండపు ఈగ నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మకూరు ఏఓ

పంటసాగులో యాజమాన్య పద్ధతులు

పాములపాడు: రైతులు తప్పని సరిగా పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, డీఆర్‌సీ ఏఓ హేమలత అన్నారు. శనివారం మండలంలోని జూటూరు గ్రామంలో మినుము పైరులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మినుము పైరును ఆశించే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

బరకసంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు

మిడుతూరు: మండల పరిధిలోని రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవ రాయ స్వామివార్లకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని పురోహితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ నిర్వహించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య మన్యసుక్త హోమం, పల్లకీసేవ నిర్వహించారు. వీపనగండ్ల గ్రామస్తులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పేరెడ్డి మురళీ మోహన్‌రెడ్డి , వీపనగండ్ల సర్పంచ్ భారతి, మాజీ ఎంపీటీసీ తిమ్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





అలంకరణలో స్వామి మూలవిరాట్, హోమం నిర్వహిస్తున్న భక్తులు

చెంచు గిరిజనుల అభివృద్ధికి కృషి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రభుత్వం చెంచుగిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తోందని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి అన్నారు. బ్రోస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీశైలం మండలపరిధిలోని మాణిక్యమ్మ సెల, హఠకేశ్వరం ప్రాంతంలో నివసిస్తున్న చెంచులకు శనివారం రగ్గులు, విద్యార్థులకు పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు సులభతరంగా ఇంగ్లిష్ మీడియంలో చదువుకునేలా పుస్తకాలను బ్రోస్ సంస్థ రూపొందించిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రోస్ సంస్థ ఫౌండర్ కె.వెంకట శ్రీధర్, బ్యాంక్‌ఆఫ్ అమెరికా వలంటీర్ రవణ, బ్రోస్ సంస్థ మెంబర్ జి.వెంకటదుర్గారావు, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.



చెంచు గిరిజన విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

27న అంతర్ పాఠశాలల రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా సంస్థల క్రీడా ప్రాంగణంలో ఈనెల 27న కర్నూలు, నంద్యాల జిల్లాల అంతర్ పాఠశాలల రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షులు గుడిపల్లి సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్నటు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ రుసుం రూ.10లు చెల్లించి నేరుగా పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9393827585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ టారిఫ్‌పై ముగిసిన అభిప్రాయ సేకరణ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ టారిఫ్‌పై ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) చేపట్టిన విచారణ శనివారంతో ముగిసింది. విశాఖపట్నం నుంచి చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు పెంచకూడదని, మెరుగైన సరఫరా అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి విన్నవించారు. వెంచర్లలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నిబంధనలను సడలించాలని క్రెడయ్ ప్రతినిధి తారకేశ్వర్ కోరారు. ఇది తమ పరిధిలోని లేని అంశమని, సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ పేర్కొంది. కార్యక్రమంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు, కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి, ఈఈలు, ఏడీఈలు పాల్గొన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్లకు శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): మలేరియా విభాగంలో పని చేసే ల్యాబ్‌టెక్నీషియన్లకు హ్యాండ్స్ ఆన్ అనే శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాలకు అనుగుణంగా శనివారం నగరంలోని మెడిటేరియన్ ఫంక్షన్ హాలు సమీపంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్‌లో 20 మంది ల్యాబ్‌టెక్నీషియన్లకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. మైక్రోస్కోపి, రిజిస్టర్స్, రికార్డ్స్, చార్ట్స్ ఎలా నిర్వహించాలనే విధానంపై వీరికి విపులంగా వివరించినట్లు పేర్కొన్నారు.

బాలికా వారోత్సవాలను జయప్రదం చేద్దాం



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ఎంపీలు, ఎమ్మెల్యే

కర్నూలు(సెంట్రల్): జనవరి 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే జాతీయ బాలికా వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో భేటీ పడావో భేటీ బచావో వాల్ పోస్టర్లను ఎంపీలు సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం, ఎమ్మిగనూరు, కోడుమూరు శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, డాక్టర్ జె.సుధాకర్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. బాలికల హక్కులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా బాలిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలన్నారు. ఆడపిల్లలను రక్షించుకోవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బాలిక విద్య ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఏపీజీబీలో ఖాతాదారులకు మెరుగైన సేవలు

వెలుగోడు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆ బ్యాంకు కడప హెచ్‌వో జనరల్ మేనేజర్ పటీద్గర్ పేర్కొన్నారు. ఆ బ్యాంకు సేవలపై శనివారం వెలుగోడులో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంక్ ఆధ్వర్యంలో రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణాలు ఇస్తున్నామన్నారు. పాడి పశువుల పోషణకు రుణం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో నంద్యాల రీజినల్ మేనేజర్ నవీన్ కుమార్, నంద్యాల సీనియర్ మేనేజర్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ అబ్దుల్ కరీం, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కడప హెచ్‌ఓ జనరల్ మేనేజర్ పటీద్గర్

కొత్తపల్లి: మండల ప్రజలు, పొదుపు మహిళలు, రైతు గ్రూపు సభ్యులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ పటీద్గర్, రీజనల్ మేనేజర్ నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఆ బ్యాంకులో సేవలపై ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ నందకిషోర్‌రెడ్డి, వెలుగు సిబ్బంది, పొదుపు మహిళలు, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో పంట రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ

పాములపాడు: సకాలంలో పంట రుణాలు చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తుందని గ్రామీణబ్యాంకు జనరల్ మేనేజర్ పీఆర్ పటీద్గర్ అన్నారు. శనివారం స్థానికంగా బ్యాంకు ఖాతాదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ తమ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. ఆన్‌లైన్ సేవలు కూడా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో రీజనల్ మేనేజర్ నవీన్‌కుమార్, మేనేజర్ నాగేంద్రమ్మ, సిబ్బంది శంకర్‌రావు, వంశీకృష్ణ, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మహానంది: మహానంది సమీపంలో ఫారం మార్గంలోని నేల బ్రిడ్జి వద్ద తెలుగుగంగ కాలువలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి వయస్సు 40 ఏళ్ల ఉండి, మృతదేహంపై దుస్తుల్లేవు. నీటి ఉధృతికి మృతదేహం కొట్టుకుపోతుంది. మృతదేహాన్ని చూస్తే మూడు రోజుల క్రితం మరణించినట్లు తెలుస్తోంది.

ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలివ్వాలి

కొత్తపల్లి: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణానికి రూ. 5 లక్షల చొప్పున సాయం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ కోరారు. రూ. 1.80 వేల నుంచి రూ. 5 లక్షలకు సాయం పెంచాలని కోరుతూ సీపీఐ పోరుబాట పోస్టర్లను ఆయన విడుదల చేశారు. స్థానిక జగనన్న కాలనీ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షలకు ప్రత్యేక బస్సులు

జూపాడుబంగ్లా: కానిస్టేబుల్ పరీక్షల నేపథ్యంలో నేడు నందికొట్కూరు డిపో నుంచి నంద్యాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కానిస్టేబుల్ పరీక్షలు రాసే వారికోసం జిల్లా కేంద్రమైన నంద్యాలలో 33 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు రాసే అభ్యర్థులు సకాలంలో కేంద్రాల వద్దకు చేరుకునేందుకు గాను నందికొట్కూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఆత్మకూరు: పోలీస్ కానిస్టేబుల్ రాతపరీక్షల నేపథ్యంలో ఆదివారం ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి కర్నూలు, నంద్యాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మహేంద్రుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఈ బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

5.5 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రాల్లో శుక్రవారం నుంచి శనివారం వరకు 5.509 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 2.912 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 2.597 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 11,704 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. అలాగే బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 750 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల ప్రవంతికి 2,026 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,261 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. ప్రస్తుతం జలాశయంలో 69.4570 టీఎంసీల నీరు నిల్వగా ఉంది. డ్యామ్ నీటిమట్టం 844.70 అడుగులకు చేరుకుంది.

అంగన్‌వాడీ కేంద్రం స్థలం ఆక్రమణ

జూపాడుబంగ్లా: మండలకేంద్రం జూపాడుబంగ్లా–4వ అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైనట్లు ఆ సెంటర్ నిర్వాహకురాలు సునీత తెలిపారు. శనివారం ఆమె తహసీల్దార్, ఎంపీడీఓలను కలిసి ఫిర్యాదు చేశారు. ఇదివరకే ఓ సారి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె తెలిపారు. కాగా స్థలం ఆక్రమణపై తహసీల్దార్ పుల్లయ్య యాదవ్ వివరణ కోరగా.. అంగన్‌వాడీ కేంద్రానికి తాము స్థలం కేటాయించామని, దానిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఐసీడీఎస్‌దేనని చెప్పారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి

మిడుతూరు: గ్రామ పంచాయతీల్లో ఇంటిపన్ను, కుళాయి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఈఓఆర్డీ ఫకృద్దీన్ ఆదేశించారు. శనివారం మండలపరిధిలోని రోళ్లపాడు, అలగనూరు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా, నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచాలన్నారు. అలాగే పంచాయతీ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం వర్మీకంపోస్టు తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకోండి



రుద్రకోడు గూడెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: గిరిజన గూడేల్లోని చెంచు గిరిజనులు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బైర్లూటీ వైద్యాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని రుద్రకోడూరు చెంచుగూడెంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడేల్లోని గర్భిణులు , బాలింతలు, పిల్లల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక పౌష్టికాహారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఝాన్సీ, శివకుమార్, భాస్కర్, శారదమ్మ, రవి,ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.